క్లుప్తంగా

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



అక్రమంగా విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పట్టుకున్న నాయకులు

చివ్వెంల : అనుమతులు లేకున్నా సీబీఎస్‌ఈ పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులోని శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు వావిళ్ల రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలలో అక్రమంగా విక్రయిస్తున్న పుస్తకాలు, యూనిఫామ్‌లను పట్టుకుని విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. అయితే సమాచారం తెలిపినా జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వారం రోజుల క్రితమే సూర్యాపేటలో వీళ్లకు సంబంధించిన శ్రీచైతన్య పాఠశాలను సీజ్ చేశారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అనుమతులు లేకున్నా సీబీఎస్‌ఈ పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజు, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు మహేష్ తదితరుల పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో లాభాలు



నాగారంబంగ్లాలో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న జిల్లా ఉద్యాన అధికారి నాగయ్య

నాగారం : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగారంబంగ్లాలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో మేఘ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారిని వి.ప్రమిత, మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్, పతంజలి ఆయిల్‌పామ్ మేనేజర్ హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, నాగరాజు, రైతులు కట్ట శేఖర్ రెడ్డి, గుంటకండ్ల సురేష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, జగదీష్‌రెడ్డి, బాలగాని సోమయ్య, మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, చీమల వెంకన్న, సోమ్లా, మంగమ్మ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రం తనిఖీ

ఆత్మకూర్ (ఎస్) : మీ సేవలో ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మీసేవ కేంద్రాలలో ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. కొన్ని మీసేవ కేంద్రాల నిర్వాహకులు వివిధ సంక్షేమ పథకాలలో అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. మీ సేవ నిర్వాహకులు ఎలాంటి అవినీతికి పాల్పడినా కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

రూ.6వేలు పింఛన్ ఇవ్వాలి

సూర్యాపేట : వికలాంగులకు రూ.6000 పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ గద్దం కాశీం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా వికలాంగుల పెన్షన్ రూ.4000 నుంచి రూ.6000లకు పెంచుతామని ప్రకటించిందని, కానీ అమలుచేయక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, వీరస్వామి, సతీష్, వెంకన్న, యాతాకుల రాజన్న మాదిగ, చింత వినయ్ బాబు, విజయరావు, రావిస్నేహలత చౌదరి, బాబు, ఎండీ జహీర్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

భవితకు భరోసా.. వెంపటి పాఠశాల

- విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేలా విద్యార్థులకు మార్గదర్శకం
- పాఠశాల అభివృద్ధి, పిల్లల చదువుకు తోడ్పాటు అందిస్తున్న గ్రామస్తులు, యువజన సంఘాలు
- విద్యార్థులు పోటీ పరీక్షల్లోనూ రాణించేలా ఉపాధ్యాయుల బోధన



పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తుంగతుర్తి : సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలంటే ఒకప్పుడు చిన్న చూపు ఉండేది. కానీ వెంపటి ప్రాథమిక పాఠశాల ఆ అభిప్రాయాన్ని మార్చేసింది. పట్టుదల, గ్రామస్తుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావం ఉంటే ఎలాంటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని నిరూపించింది. 2024–2025 సంవత్సరానికి గానూ జిల్లాలోనే ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. గత విద్యా సంవత్సరంలో అత్యధిక అడ్మిషన్లు పొందడమే కాకుండా, ఉత్తమ విద్యా బోధన అందించడమే దీనికి కారణం. సాధారణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1 నుంచి 5వ తరగతి వరకు బోధిస్తాయి, కానీ వెంపటి పాఠశాల ఒక అడుగు ముందుకేసి ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు నాణ్యమైన విద్యను అందిస్తోంది.

ఆంగ్ల మాధ్యమంలో బోధన..

ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టకముందే, వెంపటి పాఠశాలలో 2016–17 విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన ప్రారంభించారు. గ్రామంలోని యువజన సంఘాలు, గ్రామస్తుల ప్రోత్సాహంతో ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అంతకుముందు గ్రామంలోని ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపేవారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ పరిస్థితిని మార్చాలని ఉపాధ్యాయులతో పాటు యువజన సంఘాలు, కొంతమంది గ్రామస్తులు తలిచారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలనే పట్టుదలతో, దాతల సహకారంతో విద్యా వలంటీర్లను నియమించి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించారు. దీంతో వెంపటి పాఠశాలలో క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరగడం మొదలైంది. ఇప్పుడు గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటు పాఠశాలలకు గానీ, పక్క గ్రామాల పాఠశాలలకు గానీ వెళ్లడం లేదు. ఇది గ్రామస్తుల ఉమ్మడి విజయం.

చుట్టుపక్కల గ్రామాలకూ ఆదర్శం..

వెంపటి పాఠశాలలోని ఆంగ్ల మాధ్యమ బోధన చుట్టుపక్కల గ్రామాలను కూడా ఆకర్షించింది. తుంగతుర్తి, గాజులగూడెం, రావులపల్లి, రావులపల్లి ఎక్స్ రోడ్ తండా, దేవునిగుట్ట తండా వంటి గ్రామాల నుంచి విద్యార్థులు ఆరు ఆటోలలో ఈ పాఠశాలకు వస్తున్నారు. గత సంవత్సరం 282 మంది విద్యార్థులు ఉండగా 34 మంది విద్యార్థులు ఆరో తరగతి చదవడానికి బయటికి వెళ్లారు. 16 మందికి గురుకుల పాఠశాలలో సీట్లు వచ్చాయి. అయితే ఈ సంవత్సరం కొత్తగా 55 మంది చేరడంతో ప్రస్తుతం మొత్తం 288 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. ఇది వెంపటి పాఠశాల విద్యా నాణ్యతకు నిదర్శనం.

గురుకులాలకు శిక్షణ..

వెంపటి పాఠశాల కేవలం ప్రాథమిక విద్యకే పరిమితం కాలేదు. ఉపాధ్యాయులు విద్యార్థులను పోటీ పరీక్షలకు, ముఖ్యంగా గురుకుల పరీక్షలకు సిద్ధం చేస్తుంటారు. గత ఆరు సంవత్సరాల మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించి, వాటిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ అంకితభావానికి ఫలితంగా ఈ సంవత్సరం 16 మంది విద్యార్థులకు గురుకుల సీట్లు, 15 మందికి మోడల్ స్కూళ్లలో సీట్లు లభించాయి.

> **అందరి సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్నాం**
>
> 
>
> సమష్టి కృషితో పాఠశాలకు మంచి గుర్తింపు సాధించాం. ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తుల, యువజన సంఘాల, దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్నాం. పాఠశాలలో విద్యార్థులను గురుకుల, మోడల్ స్కూల్, ఇతర కాంపిటీటీవ్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం.
>
> – చిత్తలూరి వెంకట్రామనరసమ్మ, హెచ్‌ఎం, వెంపటి

వినూత్న కార్యక్రమాలు..

పాఠశాలలో కేవలం చదువుకే కాకుండా విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రాధాన్యత ఇస్తారు. క్రీడా పాఠశాలకు విద్యార్థులను ఎంపిక చేయడానికి ఒక నెల ముందు నుంచే శిక్షణ ఇస్తారు. గత సంవత్సరం ఇద్దరు విద్యార్థులు క్రీడా పాఠశాలకు ఎంపిక కాగా, ప్రస్తుతం ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వరకు వెళ్లారు. ప్రతి నెలా నాలుగో శనివారం 'నో బ్యాగ్ డే' నిర్వహిస్తారు. ఈ రోజు విద్యార్థులకు క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాలసభ వంటివి నిర్వహించి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీస్తారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

చివ్వెంల : ఆషాఢ మాసం స్వాతి నక్షత్రంను పురస్కరించుకుని మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ అరవిందాచార్యులు, శ్రీకృష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణం జరిపించారు. అనంతర భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్, బండకవి క్రిష్ణమోహన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారాహి మాత నవరాత్రోత్సవాలు



సూర్యాపేటలోని సంతోషిమాత ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని శ్రీసంతోషి మాత ఆలయంలో శ్రీవారాహి మాత నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం పదవ రోజు దేవాలయ అర్చకుడు బట్టారం వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో శ్రీ మహా వారాహిదేవి అమ్మవారికి మహా గణపతి పూజ, లక్ష్మీ గణపతిపూజ, నవగ్రహ, కాలభైరవ సహిత వారాహి అమ్మవారికి మూల మంత్ర హోమం, మంత్ర పుష్పం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంపూర్ణ పూర్ణాహుతి జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గాజుల పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన మహా కలశమునకు ఉద్వాసన చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేశంగుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రహ్మండ్లపల్లి మురళీధర్, భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై విద్యార్థులకు అవగాహన



చేతి సంచులు పంపిణీ చేస్తున్న నరేందర్

సూర్యాపేట : ప్లాస్టిక్ బ్యాగ్ రహిత వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రీన్‌క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని మారుతి విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఈ సందర్భంగా గ్రీన్‌క్లబ్ ట్రస్ట్ అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ మాట్లాడారు. భవిష్యత్ తరాలు సురక్షితంగా జీవించాలంటే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా తిరస్కరించాలన్నారు. ప్రకృతిని గౌరవిస్తూ గాలి, నీరు, ఆహారం కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు చేతి సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సలహాదారుడు జె. శశిధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్, కోశాధికారి ఉప్పల శ్రవణ్, కార్యవర్గ సభ్యులు మీలా మహాదేవ్, కక్కిరేణి చంద్రశేఖర్, బహురోజు ఉపేంద్ర చారి, పాలవెల్లి రమేష్, పీవీ లక్ష్మీనారాయణ, తోట సత్యనారాయణ, వనమాల వెంకటేశ్వర్లు, సోమా సురేష్, కొక్కుల సంపత్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో 15రోజుల పాటు జరిగిన జీజేఆర్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉంచి క్రీడలు, చదువుల్లో రాణించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1లక్ష, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.50వేలు, షీల్డ్, తృతీయ బహుమతి రూ.30వేలు, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుమలగిరి : తిరుమలగిరిలో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న సందర్భంగా వారం పాటు సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ గిరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం పరిధిలో గల విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మద్దిరాల, మద్దిరాల ఎక్స్‌రోడ్డు, కుంటపల్లి, గోరెంట్ల, రెడ్డిగూడెం, రామచంద్రపురం, గుమ్మడవెల్లి గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

తుంగతుర్తి : బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. శనివారం మండలంలోని తుంగతుర్తి, వెంపటి గ్రామాల గ్రామపంచాయతీ వర్కర్లను, గ్రామీణ హమాలీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాసు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ముత్తయ్య, గ్రామపంచాయతీ వర్కర్స్ మండల అధ్యక్షుడు సింగల్ రావు, యుగంధర్, సైదులు, వెంకన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార దినోత్సవం



తుంగతుర్తిలోని రైతు సేవా సహకార సంఘంలో జెండా ఆవిష్కరిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ సైదులు



అర్వపల్లిలోని పీఏసీఎస్‌లో రైతు సేవా సహకార సంఘం వేడుకల్లో పాల్గొన్న రైతులు, సిబ్బంది

తుంగతుర్తి : అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో సహకార జెండాను సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. సహకార సంఘం బలోపేతంతో రైతులందరికీ ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మోడం శ్రీలత, సొసైటీ డైరెక్టర్లు యాదగిరి, రామచంద్రు, మజీదు, భిక్షం రెడ్డి, రామనరసమ్మ, ఇదప్ప, యాకయ్య, రవీందర్ రెడ్డి సొసైటీ ఇన్‌చార్జ్ కార్యదర్శి యాదగిరి, సొసైటీ మాజీ సీఈఓ వందనపు వెంకటేశ్వర్లు, మహేష్, ఉమేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025 వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అందిస్తున్న సేవలను రైతులకు వివరించారు. రైతులు సకాలంలో రుణాలు అందించి సంఘం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, సిబ్బంది చిప్పలపెల్లి మహేందర్, సూరారపు శ్రీను, రైతులు కదారి నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో పరిశుభ్రత ఎంతో ముఖ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, సిబ్బంది, పట్టణవాసులు

- మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. హన్మంత రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం పట్టణంలోని 31వ వార్డులో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందని అన్నారు. ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉంచకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ట్యాంకులు, కుళాయి నీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని తెలిపారు. వీధుల్లో సంచరించే కుక్కలు, పందుల వంటి జంతువులు అనారోగ్యానికి కారణం కావచ్చని, వాటిని నివారించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శిథిల భవనాల్లో నివసించే వారు వర్షాకాలం దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న వయోజన విద్య ఏఈ భాస్కర్

చివ్వెంల : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూర్యాపేట జిల్లా వయోజన విద్య ఏఈ భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధి కోసం వీఓఏలు కృషి చేయాలని తెలిపారు. ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ చేయడానికి ఆసక్తి ఉన్న వారిని గుర్తించి, పరీక్షలు రాసే విధంగా చూడాలన్నారు. ఆడిటింగ్, బ్యాంకు ఖాతాల లీంకేజీ, స్త్రీ నిధి గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టాస్ అధికారి అనురాధ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సత్తెమ్మ, ఏపీఎం సైదయ్య, సీసీలు వెంకన్న, ఉపేందర్, ఆయా గ్రామాల వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మురళీధర్

తిరుమలగిరి: నూతన లయన్స్ క్లబ్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం తిరుమలగిరిలోని వంగపల్లి నర్సయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా గుండాల మురళీధర్, కార్యదర్శిగా దరావత్ రమేష్ నాయక్, కోశాధికారిగా బొడ్డు సుందర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ సామాజిక సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు ముందుండాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కమిటీని శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, పరశురామ్, సరేష్, ప్రసాద్, శారద, నవీన్‌కుమార్, డాక్టర్ కోటాచలం, ఇమ్మడి వెంకటేశ్వర్లు, రామచంద్రం గౌడ్, లక్ష్మణ్, పద్మారెడ్డి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

నూతనకల్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు యాస జనతారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు శనివారం ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కొరివి గంగయ్య, బొల్క సైదులు, మూడ్ మోహన్‌నాయక్, లావుద్యా శ్రీధర్, ఇరుగు కృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఎరుపు రంగు పరిచయం

నూతనకల్ : చిల్పకుంట్ల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు శనివారం ఎరుపు రంగు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడారు. ఎల్‌కేజీ విద్యార్థులకు ఎరుపు రంగులో ఉండే యాపిల్, ఎర్ర మిరప, స్ట్రాబెర్రీ, స్టార్ ఫిష్, లేడి బగ్, బెలున్ తోపాటు వివిధ రకాల పండ్లు, కూరగాయలను పరిచయం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బండపల్లి అరుణ, బత్తుల రేణుక, ఆయాలు పంతం సోమలక్ష్మమ్మ, వెంకటమల్లమ్మ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం.. ఆప్యాయ పలకరింపు



మద్దిరాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దిరాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1983–1984 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రోజులలో గడిపిన స్మృతులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. గురువులను సన్మానించారు. అనంతరం పాఠశాలలో తమ బ్యాచ్‌కు గుర్తుగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వనమాల నాగేశ్వర్‌రావు, లింగమూర్తి, ఎండీ.షబ్బీర్, రంగనాయకి, శోభరెడ్డి, కర్ణాకర్ రెడ్డి, ఆమంచి అనంతరామశర్మ, ఉప్పలయ్య, గూడ వెంకట్‌రెడ్డి, మామిడి వెంకటయ్య, వెంకటేశ్వర్లు, లింగమూర్తి, కె.రమేష్, లీలవతి, భాగ్యమ్మ, నాగమణి, జ్యోతి, సుజాత, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నెమలి అప్పగింత

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ చౌరస్తాలో ఒకరి ఇంటిలోకి శనివారం రాత్రి నెమలి రావడంతో వారు దానిని పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం పోలీసులు ఆ నెమలిని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ అధికారులు బొబ్బిలి వెంకన్న, చందు వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు యాంటీ రాబిస్ టీకాలు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు ఇవ్వడం జరుగుతుందని ప్రాంతీయ పశు వైద్యశాల డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

సమస్యలు తెలియజేశాం

అర్వపల్లి : తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమస్యలను రాష్ట్ర నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దిర్శనపు కృష్ణమూర్తి, రాష్ట్ర కోశాధికారి కుదురుపాక ఉదయ్ తెలిపారు. ఉద్యమకారుల సమస్యల సాధనకోసం హైదరాబాద్‌లో ఒక్కరోజు దీక్ష పూర్తయిన సందర్భంగా శనివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యలను ఎమ్మెల్సీ కోదండరాం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, జస్టిస్ చంద్రకుమార్‌తో పాటు పలువురు నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

సాండ్ ట్యాక్సీ విధానాన్ని పునరుద్ధరించాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తుంగగూడెం మూసీనది రీచ్‌లో నడిపిస్తున్న సాండ్ ట్యాక్సీ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని జిల్లా వినియోగదారుల అసోసియేషన్ అధ్యక్షుడు చొల్లేటి రమణ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో శనివారం వినతిపత్రాన్ని సమర్పించినట్లు చెప్పారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

తుంగతుర్తి : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అనారోగ్య సమస్య నుంచి కోలుకోవాలని శనివారం బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, రమేష్ గౌడ్, శ్రీను, నాగమల్లు, వెంకన్న, వెంకటేష్, దశరథ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా బాలకృష్ణ

నాగారం : ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన ఆలకుంట్ల బాలకృష్ణ శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని నారాయణగూడ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆయనకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆలకుంట్ల బాలకృష్ణ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపారు.


జూనియర్ అసిస్టెంట్‌కు అధికారుల నివాళి

అర్వపల్లి : తిరుమలగిరి ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన జాజిరెడ్డిగూడెం మండల కేంద్ర వాసి ఏలె వీరప్రసాద్ అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో జరిగాయి. ఈ సందర్భంగా మృతుడికి జెడ్పీ సీఈఓ అప్పారావు నివాళులర్పించారు. దహన సంస్కారాల కోసం ప్రభుత్వ పరంగా రూ.30 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. నివాళులర్పించిన వారిలో ఎంపీడీఓలు లాజర్, మారయ్య, రణధీర్‌రెడ్డి, పోలెబోయిన కిరణ్, వివిధ కార్యాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులు, నాయకులు ఉన్నారు.

కన్నీటి వీడ్కోలు

ఆత్మకూర్ : గట్టికల్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బావ బామ్మర్దుల అంత్యక్రియలు శనివారం ముగిశాయి. గురువారం గ్రామానికి చెందిన మోరపాక భిక్షం మృతి చెందడంతో ఆయన అంత్యక్రియల కోసం వచ్చిన అల్లుడు మోసంగి ఐలయ్య, భిక్షం కుమారుడు రాములుతో కలిసి బైక్‌పై నెమ్మికల్ వెళ్తుండగా ఎదురుగా బైక్ వచ్చి ఢీకొనడంతో మృతి చెందారు. కాగా శనివారం ఐలయ్య, రాములు మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పజెప్పగా గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



మాధవి

అర్వపల్లి: బాసర ట్రిపుల్ ఐటీకి జాజి రెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన మునగ మాధవి ఎంపికైంది. ఆమె జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకొని టెన్త్ పరీక్షలో 557 మార్కులు సాధించారు. ఆమెను శనివారం ఎంఈఓ బాలు నాయక్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చినవెంకట్‌రెడ్డి, తదితరులు అభినందించారు.